క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరూరి యుగంధర్ తెలిపారు. శుక్రవారం రాయచోటిలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రెండవ శనివారం విద్యుత్ ఉపకేంద్రాల నిర్వహణ నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే లైన్ షిఫ్టింగ్ కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు బస్టాండు నుంచి బంగ్లా వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

రాజంపేట డివిజన్ పరిధిలో..

రాజంపేట రూరల్ : రాజంపేట, పుల్లంపేట, నందలూరు మండలాల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజంపేట టౌన్‌తో పాటు సరస్వతీపురం, ఆకేపాటు, తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, కొండ్లోపల్లి, పుల్లంపేట టౌన్, పుత్తనవారిపల్లి, దళవాయిపల్లి, రెడ్డిపల్లి, నందలూరు టౌన్, పాటూరు, చింతకాయలపల్లి, ఎన్‌టీపల్లి, చెన్నయ్యగారిపల్లి, సబ్‌స్టేషన్‌లోని 11కేవీ ఫీడర్‌కు సమీపంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించగలరని కోరారు.

16 నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధి పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మ 22వ జాతరను ఈనెల 16వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరుపుతున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16, 17న అమ్మవారికి విశేష పూజలు, అలంకరణ, హోమాలు, మొక్కుల చెల్లింపు ఉంటుందని, అలానే 17వ తేదీ సాయంత్రం గ్రామ పొలిమేరలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని రాయచోటి మున్సిపల్ అధికారులు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం రాయచోటిలో ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆయనను మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నీటి సరఫరా, చెత్తసేకరణ లాంటివి ప్రజలకు ఇబ్బందికరంగా మారాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

గాలివీడు : సేవ్ ట్రీస్ సంస్థ సహకారంతో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా రైతులకు మొక్కలను పంపిణీ చేస్తూ వాటిని ఎలా సంరక్షించుకోవాలనే అంశంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సేవ్ ట్రీస్ సంస్థ రీసోర్స్ పర్సన్స్ సాయి చరణ్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, పెద్దమండ్యం, చిన్నమండెం, సుండుపల్లి మండలాల్లో నీటి సౌకర్యం కలిగిన రైతులను ఎంచుకుని ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. మెయిన్ క్రాప్‌గా మామిడి, బార్డర్ క్రాప్ గా మహాగని, ఎర్రచందనం, కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొక్కలకు గుంతలు తీయడం, నాటే విధానం, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేత

గాలివీడు : పదవ తరగతిలో 572 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన బాయ్స్ హైస్కూల్ విద్యార్థి గణేష్ నాయుడును అభినందిస్తూ ఆంగ్ల ఉపాధ్యాయురాలు టి.రాజేశ్వరి రూ.3000 నగదును విద్యార్థికి అందజేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ చేతులమీదుగా నగదు బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్ జాఫర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



శివ (ఫైల్)

పెనగలూరు : ఇసుక క్వారీ వద్ద విధులు నిర్వర్తిస్తూ వీఆర్‌ఏ మృతి చెందిన సంఘటన గురువారం పెనగలూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కొండూరులో పని చేస్తున్న వీఆర్‌ఏ శివకు కోమంతరాజుపురం ఇసుక క్వారీ వద్ద డ్యూటీ వేశారు. గురువారం విధులు నిర్వహిస్తుండగా మొదట ఫిట్స్ వచ్చినట్లు చెప్పడంతో ఓ చెట్టు కింద శివను విశ్రాంతి కోసం పడుకోపెట్టారు. కొంతసేపు తరువాత తోటి వీఆర్‌ఏలు శివ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే శరీరం చల్లబడిపోవడంతో, సమాచారాన్ని బంధువులకు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు క్వారీ వద్దకు వచ్చేలోపు మరణించినట్టు వారు తెలియజేశారు. శుక్రవారం మృతుని స్వగ్రామమైన పెనగలూరులో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదాం
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- రీకాలింగ్ బాబు మ్యానిఫెస్టో సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు రమేష్ కుమార్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డిలు



మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

రాయచోటి : ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలను తీసుకెళ్లి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని గడికోట శ్రీకాంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రామాపురంలోని మండల కన్వీనర్ గడికోట జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రామాపురం మండలస్థాయి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, హిందూపురం వైఎస్సార్‌సీపీ పరిశీలకులు రమేష్‌కుమార్ రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కమిటీలు, అనుబంధ విభాగాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలకు ఈ కార్యక్రమంపై స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఇంతవరకూ అందలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు వరకు మహిళలకు నెలకు రూ. 1500లు ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యుత్ బిల్లులను పెంచారన్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ విధానాన్ని ఉపయోగించాలి..

ప్రజలకు చేరువయ్యేందుకు ఈ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ స్కాన్ విధానాన్ని ఉపయోగించాలని, ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఒక బటన్ నొక్కితే చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో వివరాలు, మరో బటన్ నొక్కితే కూటమి వాగ్దానాలు నెరవేరకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందో లెక్కలు వివరాలు చూపిస్తాయని శ్రీకాంత్ రెడ్డి వివరించారు.

రాయచోటి అభివృద్ధికి ఎంతో కృషి

రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. తమ హయాంలో వెలిగల్లు నీటితో రామాపురం మండలంలో హసనాపురం గ్రామంలోని చెరువుల వరకు నీటిని అందించామన్నారు. కాలేటివాగు ప్రాజెక్టు పనులు నలభై శాతం పూర్తయ్యాయన్నారు. అర్హులందరికీ పక్కా గృహాలను అందివ్వడం జరిగిందన్నారు.

హామీలను మరిచే చరిత్ర చంద్రబాబుది – రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి

ఇచ్చిన హామీలను మరిచే చరిత్ర చంద్రబాబుకు ఉందని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటాలతోనే కూటమి ప్రభుత్వం తల్లికి వందనంను అమలు చేసిందన్నారు. జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయని, ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. గత ఐదేళ్లల్లో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి రాయచోటిని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. చంద్రబాబుకు ప్రచార యావ ఎక్కువన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, సర్పంచ్‌లు అయోధ్యపురం నాగభూషన్ రెడ్డి, వెంకటరెడ్డి, ఆయూబ్, ముంగర సుబ్బయ్య, ఆంజనేయులు రఘు, రామాంజులు, సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మురళీ మోహన్ రెడ్డి, రాజారెడ్డి, విశ్రాంత లెక్చరర్ ఈశ్వర్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆంజనేయులు, హుస్సేన్, నక్కా నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి, పక్కనే రమేష్ కుమార్ రెడ్డి

ప్రభుత్వం పేద ప్రజల కడుపుకొడుతోంది



నూనివారిపల్లి రేషన్‌షాపు వద్ద బియ్యం నిల్వపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట రూరల్ : ప్రజలందరికి నిత్యావసరమైన బియ్యంను సరఫరా చేయటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి దుయ్యబట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (ఆకేపాటి భవన్)లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని పలు రేషన్ షాపులను వారు సందర్శించారు. రేషన్ ఉందా లేదా అని ఆరా తీశారు. అధిక శాతం రేషన్‌షాపులలో బియ్యం స్టాకు లేదు అని డీలర్‌లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రతి నెల అందించే బియ్యంను కూడా అందించకుండా వారి నోటి కాడ కూడును కూటమి ప్రభుత్వం నాయకులు లాక్కుంటున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ప్రజలకు రేషన్ అందించటం కోసం ఇంటింటికి రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. అప్పుడు కేవలం లబ్ధిదారులే బియ్యంను ఇంటి వద్ద తీసుకునేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళారులను పోషించేందుకు ఇంటింటికి రేషన్ కార్యక్రమం రద్దు చేసి డీలర్‌లకు బియ్యం సరఫరాను తిరిగి అప్పగించిందన్నారు. 15 తేదీ వరకు బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం 7వ తేదీకే బియ్యం నిల్వ లేకుంటే బోధ్యం చూస్తుందా అని నిలదీశారు. అన్ని రకాల ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం జీవించేందుకు నిత్యావసరమైన బియ్యం విషయంలో కొనసాగించటం దారుణమన్నారు. దళారులపై ఉన్న ప్రేమ కూటమి ప్రభుత్వానికి ప్రజలపై లేకపోవటం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు జీవీ సుబ్బరాజు, నియోజకవర్గ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

జనాభా పెరగాలని పిలుపునివ్వటం విడ్డూరం

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో జనాభా శాతం పెరగాలని సీఎం చంద్రబాబు పదేపదే పిలుపునివ్వటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల భాస్కర్ మండిపడ్డారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆకలి సూచికలో భారత్ 101వ స్థానంలో జనాభా సూచికలో 144కోట్లు ఉందన్న విషయం మరిచారా అని గుర్తుచేశారు. ఈ పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లలను కనండి, అప్పుడే జనాభా పెరుగుతుందని సీఎం బాబు కోరటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో నేటి యువతకు కనీస అవసరాలు, ఉపాధి, ఉద్యోగాలు లభించక ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో మీకు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. వారు మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై అసాంఘిక శక్తులుగా మారితే దానికి బాధ్యులు ఎవరని నిలదీశారు. నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం ఇప్పటికే రాష్ట్రంలో విలయ తాండవం చేయటంలేదా అని నిలదీశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో జనాభాను పెంపొందించుకుందాం అని సీఎం స్థాయి వ్యక్తి పిలుపునివ్వటం ఎంతమటుకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ఈ పిలుపుని సీఎం చంద్రబాబు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

రాయచోటి జగదాంబసెంటర్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారినటువంటి జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలేని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, పలువురు ఏఐఎస్‌ఎఫ్ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న న్యాక్ కేంద్రంలో నిరుద్యోగ ఎస్సీ మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సహాయ సంచాలకులు ఎం.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి ఆపై చదువుకొని 18 సంవత్సరాలు పైబడి 40 సంవత్సరాలలోపు వయస్సు గల వారు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. పై రెండు కోర్సులకు రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో మధ్యాహ్నం ఉచిత భోజన వసతిని కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 14వ తేదీలోపు న్యాక్ శిక్షణా కేంద్రంలో తమ దరఖాస్తును అందజేయాలన్నారు. వివరాలకు 79897 33065 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న బోధనాభ్యాస సామగ్రి ప్రదర్శన



మెటీరియల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : పుల్లంపేట మండలం దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బోధనాభ్యాస సామగ్రి ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ మెటీరియల్స్ ఉపయోగించి పాఠాలు బోధించడానికి అర్థమయ్యేలా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ బోధనాభ్యాస సామగ్రి వలన బోధన సులభతరమే కాక విద్యార్థులు విద్యను త్వరగా నేర్చుకుని గుర్తుపెట్టుకుంటారన్నారు. ఈ ప్రదర్శనలో టి కప్స్‌తో చేసిన వర్ణమాల, ఆల్ఫాబెట్ హౌస్, స్థాన విలువల చార్ట్, గణిత మేజిక్ బోర్డు, కలర్ పేపర్స్‌తో చేసిన క్రాఫ్ట్ వర్క్ మోడల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వీధిలైట్లకు మరమ్మతులు

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామంలోని వీధిలైట్లకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించారు. రాత్రి సమయంలో విషపురుగులు సంచరించడంతో వీధుల్లో ప్రజలు తిరగాలంటే భయాందోళన చెందేవారు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ వీధిలైట్లకు మరమ్మతులు నిర్వహించడంతో విద్యుత్ కాంతులు విరిశాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

రాయచోటి టౌన్ : నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్‌స్కిల్స్ పెంచుకొంటేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏఆర్‌డీఓఐటీ ఆర్టెక్ ఇన్ఫో బెంగుళూరు సంస్థకు చెందిన హెచ్‌ఆర్ రిక్రూటర్ జావిద్ ఖాన్ పఠాన్ అన్నారు. శుక్రవారం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఆర్‌డీఓఐటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులు తమ చదువును పూర్తి చేసుకొని ఉద్యోగాల కోసం వెళితే మీరు కోరిన విధంగా ఉపాధి కానీ ఉద్యోగం కానీ లభించదన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాభివృద్ధితో విషయాన్ని ఎదుటి వారికి క్లుప్తంగా వివరణ ఇవ్వడం, ఆత్మన్యూనత భావాన్ని తొలిగించుకొని కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని అప్పుడే మీరు కోరిన స్థాయిలో ఉద్యోగం లభిస్తుందని చెప్పారు. అనంతరం కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ, వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాలు జగన్‌వి..
ప్రచార ఆర్భాటం చంద్రబాబుది



భాస్కర్‌యాదవ్ బయనబోయిన

నందలూరు : పథకాల రూపకల్పన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే ప్రచార ఆర్భాటం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదని వాలంటీర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బయనబోయిన భాస్కర్‌యాదవ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం ప్రవేశపెడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేరు మార్చి తల్లికి వందనం అని మార్చారన్నారు. ఇప్పుడే కొత్తగా ప్రవేశపెట్టినట్లు అది మంత్రి నారా లోకేష్ ఆలోచనలో నుంచి పుట్టినట్లు చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేస్తే అక్కడ ఉన్న బెంచీలకు మన బడి మన భవిష్యత్తు అని స్టిక్కర్‌లు అంటించుకుని మేమే చేసేశాం అని చెప్పుకోవడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని చెప్పారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని, వేరే ముఖ్యమంత్రులు చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను తానే చేశానని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెప్పి ఆయన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



చాన్‌బాషాను పరామర్శిస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : ప్రమాదవశాత్తు గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మైనార్టీ నాయకులు చాన్ బాషాను శుక్రవారం ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్ నాయుడు, జగన్‌మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, చెంద్రాయుడు, జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాజు, దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ శివారెడ్డి, యూత్ అధ్యక్షులు జగన్నాథ నాయుడు, వాసుదేవుడు, రవిరెడ్డి, లక్ష్మీరెడ్డి, రాఘవరెడ్డి, ధర్మారెడ్డి, శంకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నారద, జాకీర్, డిల్లీ విశ్వనాథరెడ్డి, నవాజ్, మన్సూర్, నాగేంద్రబాబు, లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీ ప్రారంభం

వైఎస్సార్‌సీపీ నాయకులు మూగి శ్రీరాములు మండలంలోని పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన మదర్ డైరీ కేంద్రాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించాలన్నారు.

కార్యకర్తల నడుమ పుట్టినరోజు వేడుక



మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి సత్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి : మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం మండలంలోని సుద్దమళ్ల గ్రామం యర్రంరెడ్డిగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డితో కలిసి అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ కేక్ కట్ చేసి మోహన్ రెడ్డిని దుశ్శాలువాలతో సత్కరించి గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. రామాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మోహన్ రెడ్డి చేత కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాయచోటికి చెందిన మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్, కౌన్సిలర్ సాదిక్‌లు మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట నారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంకర్ నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, మైనార్టీ నాయకులు సాహెబ్, ఇర్షాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధారెడ్డి, రంగారెడ్డి, సభాపతి నాయుడు, డిల్లీ విశ్వనాథ రెడ్డి, రామయ్య, గాలివీటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆదిరెడ్డి, బసిరెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, తోటంశెట్టి వరుణ్ కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సిద్దవటం : మండల కేంద్రంలోని గంగమ్మ గుడి వద్ద ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంత్, డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ చెల్సీ, డాక్టర్ నవీనా, డాక్టర్ అబూ బకర్, డాక్టర్ రిజ్వానా, డాక్టర్ తబసమ్, మరి కొందరు వైద్యులు జనరల్ మెడిషన్, జనరల్ సర్జరీ, చర్మ వ్యాధులు, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చిన్న పిల్లలకు, చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి 112 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంతేగాకుండా బీపీ, షుగర్, హెచ్‌బీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమలో మెడికల్ క్యాంపు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పరామర్శ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండల వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. గుండెకు స్టెంట్ వేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రవిశంకర్‌రెడ్డి(బాబు)ను శుక్రవారం బండపల్లె గ్రామం వెంకటరెడ్డిగారిపల్లెలో శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి త్వరితగతిన ఆరోగ్యవంతుడవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.


జేఎల్‌ఎం గ్రేడ్ - 2లకు వెంటనే ప్రమోషన్ ఛానల్ ఇవ్వాలి



డీఈఈకి వినతిపత్రం అందజేస్తున్న జేఎల్‌ఎంలు

చిన్నమండెం : జేఎల్‌ఎం గ్రేడ్ - 2లకు వెంటనే ప్రమోషన్ ఛానల్ కల్పించాలని అసోసియేషన్-5 రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చల్లా ప్రతాప్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రెడ్డిరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం రాయచోటి డివిజన్ కార్యాలయలలో విద్యుత్ డీఈఈ విజయ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2లకు నూతన సర్వీస్ రూల్స్‌ను రద్దు చేసి నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ ప్రకటించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించకుంటే ఈ నెల 21న విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్-5 సంఘ నాయకులు దర్బార్, మహేష్, మహమ్మద్, రూపేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రమేష్‌రెడ్డి

సిద్దవటం : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రైతులకు అందిస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్యపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు, అన్నదాత సుఖీభవ, పి.ఎం. కిసాన్, సమ్మాన్‌నిధి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, మొదలైన వ్యవసాయ సంబంధిత పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ (విశిష్ట గుర్తింపు సంఖ్య) తప్పనిసరి అని వివరించారు. ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్స్ చేసినవి ఎప్పటికప్పుడు తమ లాగిన్‌లలో వెరిఫికేషన్ పూర్తి చేయాలని తెలిపామన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందని వారు వెంటనే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు తిరుమలబాబు, ఏఈఓ వై. ప్రభాకర్‌రెడ్డి, వీఆర్‌ఓలు, పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి మనిషే మూలధనం



రాయచోటి: విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డైట్ అధ్యాపకులు

రాయచోటి : దేశాభివృద్ధికి మానవ వనరే అసలైన మూలధనమని డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం డైట్‌లో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా, దాని ప్రభావాలు, సవాళ్లు, పరిష్కారాలపై అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం సెమినార్‌లో పాల్గొని ప్రతిభ చూపిన తన్మయి, తస్మియా, తహేర, సాదిక్ విద్యార్థులకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్‌లు శివ భాస్కర్, వైసి రెడ్డప్ప రెడ్డి, గిరిబాబు యాదవ్, తిరుపతి శ్రీనివాసులు, శివ ప్రసాద్, కలీముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో అనేక ఇబ్బందులు

సిద్దవటం : జనాభా పెరుగుదలతో ఇటు కుటుంబానికి అటు దేశానికి ఎన్నో నష్టాలు కలుగుతాయని పి.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ప్రపంచ్ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల కలిగే ఆశిక, వనరుల కష్ట, నష్టాలను ప్రజలకు తెలిపారు. బాల్య వివాహాలపై జరిగే నష్టాలపై వివరించారు. వాతావరణంలో మార్పుల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మినరసమ్మ, సూపర్ వైజర్లు, లక్ష్మీదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన గర్భధారణతో బిడ్డకు ఉత్తమ భవిష్యత్

రాజంపేట రూరల్ : ప్రణాళికాబద్ధకమైన గర్భధారణ వలన బిడ్డకు ఉత్తమమైన భవిష్యత్తునిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఏరియా వైద్యశాల నుంచి ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న వైఎస్సార్ సర్కిల్ వరకు ప్రపంచ జనభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సానే శేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పీపీ యూనిట్, ఈడిగపాళెం, మన్నూరు యూపీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలతో పీపీ యూనిట్‌లో సానే శేఖర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యులు లక్ష్మిప్రసన్న, వికాస్, అశోక్ చైతన్య, స్నేహలత, సూపర్‌వైజర్ చెన్నమ్మలతో పాటు ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్



సిద్దవటం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పి.కొత్తపల్లె వైద్య అధికారులు, సిబ్బంది